సాక్షి అనంతపురం

గురువారం । 14 । డిసెంబర్ । 2023



ఢిల్లీ వెళ్లిన కలెక్టర్

ఎన్నికల కమిషన్ గురు, శుక్రవారాల్లో ఢిల్లీలో నిర్వహించే కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు కలెక్టర్ గౌతమి బుధవారం వెళ్లారు.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/16.8°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగంలో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యుల వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం మీడియాకు వెల్లడించింది. విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాదిరెడ్డి నరేంద్రరెడ్డి (అనంతపురం), కార్యదర్శులుగా ఎస్‌కే షెక్షావలి (అనంతపురం), బూచిపల్లి రఘుకుల తేజేష్‌రెడ్డి (శ్రీసత్యసాయి జిల్లా), సహాయ కార్యదర్శులుగా బంగారు వంశీ (అనంతపురం), వేముల అమర్‌నాథ్‌రెడ్డి (శ్రీసత్యసాయి జిల్లా), అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా గంగలకుంట కేశవర్ధన్‌రెడ్డి (అనంతపురం)ని నియమించారు.

టీచింగ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అనంతపురం సిటీ: అనంతపురం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు విశ్వవిద్యాలయం ఉప కులపతి కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. టీచింగ్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ జయలక్ష్మి, సెక్రటరీగా డాక్టర్ శారద, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ శివకుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ విష్ణువర్ధన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారంతా కలసి యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రంగజనార్దన, రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతిని కలిశారు.

అధ్యాపకుల పాత్ర కీలకం

అనంతపురం: విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర చాలా కీలకమని జేఎన్‌టీయూ (ఏ) వీసీ ఆచార్య జి.రంగజనార్దన అన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రధానాచార్యులు, అధ్యాపకులు, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు, వలంటీర్లు, ఉత్తమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను వివిధ రకాల అవార్డులకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఎంపికైన వారికి యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులను ఆయన ప్రదానం చేసి, మాట్లాడారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో చాలా మందిలో సామాజిక స్పృహ కొరవడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం పట్ల ఏమాత్రం బాధ్యత లేకుండా కొందరు ప్రవరిస్తున్నారన్నారు. క్షణం తీరిక లేని విధంగా తల్లిదండ్రులు మారిపోయారని, కనీసం తమ పిల్లల వ్యక్తిగత విషయాల్లోనూ వారు శ్రద్ధ పెట్టలేకపోతుండడం బాధాకరమన్నారు. దీంతో ఎంతో మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితి నుంచి కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం కాకుండా మానవ సంబంధాలు బలపడేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శశిధర్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరింత పవర్‌ఫుల్

- పక్కన కనిపిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో రూ.2కోట్ల నిధులతో నిర్మించారు. ఇటీవలే ప్రారంభించారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం కావడంతో అప్రాచెరువుతో పాటు గంటాపురం, జ్వాలాపురం, చెన్నపట్నం, వరదాపురం, సంగాల, విశ్వనాథపురం, తమ్మాపురం గ్రామాల గృహ, వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోంది.



- లో ఓల్టేజీ సమస్యలకు చెక్
- ఉమ్మడి జిల్లాకు 37 అదనపు సబ్ స్టేషన్లు
- రూ.81 కోట్ల నిధుల మంజూరు
- ఇప్పటికే 16 సబ్ స్టేషన్లు ప్రారంభం
- మరో 21 సబ్ స్టేషన్ల నిర్మాణాలు 90 శాతం పూర్తి

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా ఆ సంస్థ అడుగులు వేస్తోంది. లో ఓల్టేజీ సమస్యకు పూర్తిస్థాయిలో శాశ్వత పరిష్కారం చూపేందుకు అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 261 సబ్ స్టేషన్ల ద్వారా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కొన్ని సబ్ స్టేషన్లకు సుదూర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆరు విద్యుత్ డివిజన్ల పరిధిలో 37 అదనపు సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం రూ.81.4కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన 16 సబ్‌స్టేషన్లను అధికారులు ప్రారంభించారు. మిగిలిన 21 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో సాగుతున్నాయి. ఈ నెలాఖరులోపు 100 శాతం పనులు పూర్తయ్యే విధంగా కాంట్రాక్టర్లకు విద్యుత్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాటి నిర్మాణ పనులు పూర్తయితే జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు లో ఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

జనవరిలో అందుబాటులోకి



నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదనపు సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నాం. ఇప్పటికే 16 సబ్ స్టేషన్ల పనులు పూర్తి కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు లో ఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మిగిలిన 21 సబ్ స్టేషన్లు ఈ నెలాఖరులోపు పూర్తి చేసి వచ్చే జనవరి నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– సురేంద్ర, విద్యుత్ శాఖ, ఎస్ఈ

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

డివిజన్	గృహ కనెక్షన్లు	కమర్షియల్ కనెక్షన్లు	వ్యవసాయ కనెక్షన్లు
అనంతపురం	2,13,994	30,452	33,600
అనంతపురం రూరల్	1,32,171	13,425	58,906
గుత్తి	1,97,843	22,616	48,594
హిందూపురం	1,98,574	19,662	42,282
కదిరి	1,88,740	1,71,19	51,246
కళ్యాణదుర్గం	1,62,430	13,698	75,543
మొత్తం	10,93,752	1,16,982	3,10,171

- అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో దాదాపు రూ.2.5 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. నెలాఖరులోపు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి అనంతపురం రూరల్ మండలం కొడిమి, ప్రజా చైతన్యకాలనీ, జర్నలిస్టు కాలనీ, నరసనాయనికుంట, ఎ.నారాయణపురం, కూడేరు మండలం గొటుకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, లెప్రసీ కాలనీ తదితర గ్రామాల గృహ, వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ అందనుంది.



మట్కారాయుళ్ల పీచమణచండి

అనంతపురం క్రైం: జిల్లాలో మట్కారాయుళ్ల పీచమణచాలని ఎస్పీ అన్బురాజన్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మట్కా జోలికెళితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలన్నారు. బుధవారం ఆయన సమావేశంలో జిల్లా వ్యాప్తంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్పెషల్ డ్రైవ్ కింద జిల్లా వ్యాప్తంగా పోలీసులు మట్కా బీటర్లు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా వేశామన్నారు. మట్కాతో సంబంధాలు ఇదివరకే కొనసాగించిన వారితో పాటు వారి వద్ద బీటర్లుగా పని చేసిన వారిని కూడా వదలబోమన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలోని ప్రతి ఒక మట్కా నిర్వాహకుకు, బీటర్లను పోలీసు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. అత్యాశ చూపి అమాయక ప్రజల జీవితాలతో చెలగాటమాడకూడదన్నారు. జిల్లాలో ఎక్కడైనా మట్కా నిర్వహిస్తుంటే తన నంబర్ 9440796800కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మట్కా నిర్వాహకులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

గుత్తి: నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు 19 నెలల జైలు శిక్ష పడింది. ఈ మేరకు గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డి.దీప్తి బుధవారం తీర్పు చెప్పారు. ఈ కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. 2015 నవంబర్ 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో తన తల్లి సుంకమ్మ చనిపోయిందని పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లికి చెందిన సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈశ్వరమ్మ అనే మహిళ కూడా ఈ ప్రమాదంలో గాయపడిందని అందులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్‌ఐ రమణారెడ్డి దర్యాప్తు నివేదికను కోర్టుకు సమర్పించారు. ఈ కేసును జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి దీప్తి సమగ్రంగా విచారించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదం జరిగిందని నిర్ధారించి ఆటో డ్రైవర్ రామాంజనేయులుకు 19 నెలల జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. అప్పటి దర్యాప్తు అధికారితో పాటు ప్రస్తుత ఎస్‌ఐ డి.శ్రీనివాసులు, ఏపీపీ హరిప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ మారుతీప్రసాద్‌లను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

పారదర్శకంగా దరఖాస్తుల పరిష్కారం

- ఓట్ల తొలగింపు క్లెయిమ్‌లపై సూక్ష్మ పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో పారదర్శకత పాటిస్తున్నామని కలెక్టర్ గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. ప్రధానంగా ఓట్ల తొలగింపు దరఖాస్తులను క్షేత్రస్థాయిలోకి వెళ్లి సూక్ష్మపరిశీలన చేస్తున్నామన్నారు. ఓటరు జాబితా సవరణ, క్లెయిమ్‌ల పరిష్కారంపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం–6) 1,33,696 దరఖాస్తులు రాగా 92,788 పరిష్కరించామని, 11,512 దరఖాస్తులు తిరస్కరించామని వెల్లడించారు. 29,396 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓట్ల తొలగింపునకు (ఫారం –7) 1,16,004 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 64,393 పరిష్కరించామని, 17,189 తిరస్కరించామని పేర్కొన్నారు. 34,422 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఓటరు వివరాల్లో చేర్పులు, మార్పులకు (ఫారం–8) 1,27,798 దరఖాస్తులు రాగా అందులో 1,07,570 పరిష్కరించామని, 5,264 తిరస్కరణకు గురయ్యాయన్నారు. 14,964 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ ఈ నెల 26లోగా పరిష్కరిస్తామన్నారు.

పారదర్శకంగా విచారణ

ప్రధానంగా ఓట్ల తొలగింపు క్లెయిమ్‌లను అత్యంత పారదర్శకంగా విచారణ చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు బీఎల్‌ఓలో క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారన్నారు. మరణ ధ్రువీకరణ పత్రం లేదా పంచనామా, వారి కుటుంబ సభ్యుల నుంచి రాతపూర్వక వాంగ్మూలం తీసుకున్న తరువాత తొలగించేందుకు ఏఈఆర్‌ఓకు సమర్పిస్తారన్నారు. ధ్రువీకరణ పత్రాలను ఏఈఆర్‌ఓ పరిశీలన చేసిన తరువాత తదుపరి చర్యలకు ఈఆర్‌ఓకు సమర్పిస్తారన్నారు. దరఖాస్తును ఈఆర్‌ఓ పరిశీలించిన అంగీకరించిన తరువాత జాబితా నుంచి ఓటు తొలగిస్తున్నారన్నారు.

నిబంధనల ప్రకారంమే తొలగింపు

డూప్లికేట్ ఓట్ల విషయంలో నిబంధనలు పాటిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి దరఖాస్తులను ఈఆర్‌ఓ తన లాగిన్ ద్వారా ఫార్మెట్–ఏ, ధ్రువీకరణ లేఖను సంబంధిత ఓటరుకు స్పీడ్ పోస్టు ద్వారా పంపిస్తారన్నారు. ఓటరు ఏ ఓటును జాబితా నుంచి తొలగించాలని ధ్రువీకరణ లేఖ ఇస్తారో దానిని తొలగిస్తారన్నారు. వీటికి 15 రోజుల గడువు ఉంటుందన్నారు. ఆ తరువా కూడా ఓటరు సమాధానం ఇవ్వకపోతే బీఎల్‌ఓ నేరుగా ఓటరు ఇంటికెళ్లి విచారణ చేసి డూప్లికేట్ ఓటు తొలగించేందుకు ధ్రువీకరణ లేఖను తీసుకుని ఏఈఆర్‌ఓకు సమర్పిస్తారన్నారు. ఏఈఆర్‌ఓ పరిశీలనంచి ఈఆర్‌ఓకు పంపుతారన్నారు. వాటిని ఈఆర్‌ఓ పరిశీలించి డూప్లికేట్ ఓటును తొలగిస్తారన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలనేదానిపై స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. కలెక్టరేట్, మూడు ఆర్డీఓ కార్యాలయాలు, నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా ఐదు వాహనాలు గ్రామాల్లో పర్యటిస్తూ ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు కేవీ రమణ, సోమశేఖర్‌రెడ్డి, టీడీపీ ప్రతినిధి పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఇమామ్, బీజేపీ ప్రతినిధి శ్యాంసుందర్, సీపీఎం ప్రతినిధి బాలరంగయ్య, సీపీఐ ప్రతినిధి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలింత ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేస్తున్న బాలింతను రక్షిస్తున్న బంధువులు

పెనుకొండ రూరల్: రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో భర్త ముఖం చాటేశాడు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న బాలింత ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో అప్రమత్తమైన బంధువులు ఆమెను కాపాడి ఇంటికి చేర్చారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన శ్రావణిబాయికి అడదాకులపల్లికి చెందిన మహేష్‌నాయక్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద రూ.50 వేలు, మూడు తులాల బంగారాన్ని శ్రావణి తల్లిదండ్రులు ఇచ్చారు. ఏడాది పాటు కాపురం సజావుగా సాగినా... మొదటి ప్రసవంలో ఆడపిల్ల పుట్టడంతో అదనపు కట్నం కావాలంటూ భర్త వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో ముఖం చాటేశాడు. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన శ్రావణి మంగళవారం ఉదయం వ్యవసాయ బావిలో దూకేందుకు సిద్ధమైంది. విషయాన్ని గమనించిన సమీప బంధువులు వెంటనే అప్రమత్తమై ఆమెను పక్కకు లాగారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

శింగనమల: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రం పెస్టిసైడ్ షాపు, శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక ఫర్టిలైజర్స్‌లో చేపట్టిన తనిఖీల్లో రెండు రకాల పురుగు మందులకు సంబంధించి నిల్వలు అప్‌డేట్ చేయలేదన్నారు. స్టాక్ బోర్డు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రూ.80,692 విలువైన పెస్టిసైడ్, ఎరువుల విక్రయాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వాసుప్రకాష్, ఎస్‌ఐ శేషగిరి పాల్గొన్నారు.



మురిపించిన మణిపురి జానపద నృత్యం

పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మణిపూర్ సత్యసాయి భక్తులు బుధవారం ఉదయం సాయికుల్వంత్ మందిరంలో నిర్వహించిన జానపద కళాఉత్సవం ఆకట్టుకుంది. లాయ్ హరోబా పేరుతో సాగిన జానపద నృత్య ప్రదర్శన ఆ ప్రాంత సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబించింది.

–ప్రశాంతి నిలయం







సాయికుల్వంత్ సభామందిరంలో మణిపూర్ సత్యసాయి భక్తుల జానపద నృత్య ప్రదర్శన

సబ్ డివిజన్ అయ్యాకే రిజిస్ట్రేషన్

- పారదర్శకంగా క్రయవిక్రయాలు
- నకిలీ రిజిస్ట్రేషన్లకు పూర్తిగా చెక్
- దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో సబ్‌డివిజన్
- రీసర్వే అనంతరం పక్కాగా భూముల క్రయవిక్రయాలు
- జిల్లాలో భారీగా మిగులు భూములు ఉన్నట్టు రీసర్వేలో వెల్లడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సరికొత్త సంస్కరణలకు సర్కారు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష కార్యక్రమం కింద భూముల సమగ్ర రీ సర్వే మహా యజ్ఞంలా సాగుతోంది. భూముల రీసర్వేతో పాటు ఇకపై భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి అవకతవకలూ జరగకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో భవిష్యత్‌లో డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ రిజిస్ట్రేషన్లు, నకిలీ పట్టాలు ఇలాంటివేమీ ఉత్పన్నం అయ్యే అవకాశమే ఉండదని అధికారులు చెబుతున్నారు.

15 రోజుల్లో సబ్‌డివిజన్

ఇకపై అమ్ముకోవాలనుకునే భూమిని సబ్ డివిజన్ అయ్యాకే రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఉదాహరణకు ఒక రైతుకు 10 ఎకరాల పొలం ఉంటుంది. ఈ పొలంలో 5 ఎకరాలు అమ్ముకోవాలనుకుంటారు. ఈ రిజిస్ట్రేషన్ ఉత్తరం దిక్కునో, దక్షిణం అనో రాయించి రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇకపై ఇలా ఉండదు. అమ్మే ముందు అమ్మాలనుకునే 5 ఎకరాలు తనపేరు మీదే సబ్‌డివిజన్ చేయించుకోవాలి. ఆన్‌లైన్లో దరఖాస్తు చేస్తే 15 రోజుల్లో సబ్‌డివిజన్ చేస్తారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో సెపరేటుగా 5 ఎకరాల భూమి కనిపిస్తుంది. వెంటనే అమ్ముకోవచ్చు. అమ్మే వారికి, కొనేవారికి దీనివల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

తహసీల్దార్ ఆపడానికి లేదు

సబ్‌డివిజన్‌కు దరఖాస్తు చేసిన రోజు నుంచి 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. ఒకవేళ చేయకపోతే ఎందుకు చేయలేదో కారణాలు చూపాలి. అంతేకానీ దీన్ని ఆపడానికి లేదు. పక్కాగా ఉన్న భూములకైతే కచ్చితంగా 16వ రోజున సబ్‌డివిజన్ అయిన భూమి ఆన్‌లైన్‌లో ఉండాలి. ఒకవేళ తహసీల్దార్ కారణం లేకుండా సబ్‌డివిజన్ చెయ్యకపోతే జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. దీనివల్ల దొంగ రిజిస్ట్రేషన్లకు తావుండదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

భారీగా మిగులు భూములు

రీసర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. వాస్తవంగా ఐదెకరాల పొలం పాస్‌బుక్కులో ఉండగా, రీసర్వేలో 8 ఎకరాల నుంచి 10 ఎకరాలకు పైగా ఉంటోంది. ఇలా ఒక్క పుట్లూరు మండలంలోనే 6 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా 5వేల ఎకరాలు మిగులు భూమి తేలింది. ఇలా జిల్లా మొత్తంగా 80వేల ఎకరాలు ఎక్కువగా తేలే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మిగులు భూములను ప్రభుత్వ భూములుగా కనపరుస్తున్నారు.

వివాదాలకు కళ్లెం

సబ్ డివిజన్ చేసిన తర్వాతే భూములు అమ్మడం, రిజిస్ట్రేషన్ కావడం అనేది రెవెన్యూ సంస్కరణల్లో చాలా కీలకమైనది. దీనివల్ల రిజిస్ట్రేషన్‌ల విషయంలో ఎప్పుడూ వివాదం ఉండదు. బాధితులు అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు.

–కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్

భవిష్యత్ తరాలకు గొప్ప వరం

సబ్ డివిజన్ అనంతరం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు వచ్చాయి. త్వరలో దీన్ని అమలు చేయబోతున్నాం. దీనివల్ల భవిష్యత్‌లో ఏ భూమి కొనాలన్నా అమ్మాలన్నా నిరభ్యంతరంగా కొనుక్కోవచ్చు. నకిలీలకు తావే ఉండదు.

–మోహన్‌కుమార్, తహసీల్దార్, పుట్లూరు

క్లుప్తంగా

సంతృప్తికర పరిష్కారం



అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేసు

శింగనమల: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బాధితులు అందజేసిన ప్రతి అర్జీకీ సంతృప్తికర పరిష్కారం చూపుతామని ఆర్డీఓ జి.వెంకటేష్ అన్నారు. బుధవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 105 వినతులు అందాయి. అత్యధికంగా భూ సంబంధిత సమస్యలపై వినతులు అందడంతో పరిశీలించి, పరిష్కారం చూపాలని తహసీల్దార్ ఈశ్వరమ్మను ఆర్డీఓ ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డీఎల్‌డీఓ ఓబులమ్మ, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, డీఎస్‌ఓ శోభారాణి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్: మండలంలోని తాడిపత్రి– చల్లవారిపల్లి గ్రామాల మధ్య బుధవారం రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి దాదాపు 52 సంవత్సరాల వయస్సు ఉంటుంది. రైలు కింద పడడంతో శరీరం ఛిద్రమైంది. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

లక్ష్యం దిశగా మార్కెట్‌యార్డులు

- రూ.10.81 కోట్లకు గానూ రూ.7 కోట్ల వసూళ్లు
- 93 శాతంతో లక్ష్యానికి చేరువగా శింగనమల కమిటీ

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశించుకున్న వసూళ్లు సాధిస్తూ లక్ష్యం దిశగా మార్కెటింగ్‌శాఖ పయనం సాగిస్తోంది. జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది వివిధ రూపాల్లో రూ.10.81 కోట్ల వసూళ్లు లక్ష్యంగా నిర్దేశించుకోగా గత ఎనిమిది నెలల కాలంలో 63 శాతంతో రూ.7 కోట్ల వసూళ్లు సాధించారు. మిగిలిన నాలుగు నెలల కాలంలో వంద శాతాన్ని అధిగమించడం కష్టం కాదని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి అన్నారు. మొత్తంగా పరిస్థితి ఆశాజనకంగానే ఉన్నా... గుత్తి, గుంతకల్లు మార్కెట్ కమిటీలు పూర్తి వెనుకంజలో ఉండడం ఆందోళనకరం.



శింగనమల మార్కెట్ కమిటీ

శింగనమల టాప్

పశువులు, జీవాల సంతలు, చింత, మిరప, చీనీ, ఇతర ఉత్పత్తుల క్రయవిక్రయాలు, గోదాములు, షాపుల అద్దెలు, రెన్యువల్స్, చెక్‌పోస్టుల ద్వారా వ్యవసాయోత్పత్తుల రవాణా, ఇతరత్రా సెస్సుల రూపంలో ఆదాయం పెంచుకునేందుకు మార్కెట్ కమిటీలకు లక్ష్య నిర్దేశన చేశారు. గత ఎనిమిది నెలల్లో 93 శాతం వసూళ్లతో శింగనమల మార్కెట్ యార్డు అగ్రస్థానంలో నిలిచింది. రూ.75 లక్షలకు గానూ ఇప్పటికే 70.22 లక్షల వసూళ్లు జరిగాయి. ఆ తర్వాత అనంతపురం మార్కెట్ కమిటీ రూ.4.10 కోట్లకు గానూ 78 శాతంతో రూ.3.17 కోట్ల వసూళ్లతో రెండో స్థానంలో నిలిచింది. మొదటి నుంచి ఈ రెండు కమిటీలు దూకుడు కొనసాగిస్తున్నాయి. తాడిపత్రి 65 శాతం, ఉరవకొండ 61 శాతం, రాప్తాడు 55 శాతం, కళ్యాణదుర్గం 50 శాతం, రాయదుర్గం మార్కెట్ కమిటీలు 46 శాతం సాధించాయి. ఎటుతిరిగి గుత్తి రూ.28 లక్షలకు గానూ 38 శాతంతో రూ.10.68 లక్షలు, గుంతకల్లు కమిటీ రూ.85 లక్షలకు గానూ రూ.25.24 లక్షల వసూళ్లతో వెనుకంజలో నిలిచాయి. మిగిలిన నాలుగు నెలల కాలంలో ఈ రెండింటితో పాటు రాయదుర్గం., కళ్యాణదుర్గంలోనూ వంద శాతం వసూళ్లు సాధించడం కష్టమని అధికారులే చెబుతున్నారు. అయితే 9 కమిటీలు వంద శాతం చేరుకునేలా ఈ నాలుగు నెలలు విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయడంతో పాటు సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సిబ్బందిని అప్రమత్తం చేయనున్నట్లు ఏడీఎం సత్యనారాయణచౌదరి తెలిపారు.

ప్రతి బిల్లు నుంచి ఒక శాతం సెస్సు

- భవన నిర్మాణ కార్మికుల జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో నిర్ణయం

అనంతపురం సిటీ: కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, ఈ క్రమంలో కాంట్రాక్టర్‌కు చెల్లించే ప్రతి బిల్లు నుంచి ఒక శాతం సెస్సును విధిగా వసూలు చేసి కార్మికుల సంక్షేమ బోర్డుకు చెల్లించాలని భవన నిర్మాణ కార్మికుల జిల్లా స్థాయి సమన్వయ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ యమ్మాని భాగ్యరాజ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఏసీఎల్ రఘురాములు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సుజాత, రమాదేవి, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అంజలి, అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌అండ్‌బీ, పరిశ్రమల శాఖ, అహుడా, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. భవన , ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం, సంక్షేమం, సామాజిక భద్రతపై చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు సంబంధించి భవన నిర్మాణ మొత్తం వ్యయంపై ఒక శాతం సెస్సును కచ్చితంగా వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్లాన్ అప్రూవల్‌పై సుదీర్ఘ చర్చ జరిగింది. సెస్సు డిమాండ్, వసూలు, నిల్వపై శాఖల వారీగా సమీక్షించారు. సెస్సు బకాయిలను సకాలంలో కార్మిక సంక్షేమ శాఖ బోర్డుకు చెల్లిస్తే.. సంక్షేమ ఫలాలను కార్మికులకు సకాలంలో అందజేసేందుకు వీలవుతుందన్నారు.



చర్చిస్తున్న వివిధ శాఖ అధికారులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.15 లక్షల విలువ చేసే బంగారు నగల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్

గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, రూ.15 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నగేష్‌కుమార్ తెలిపారు. వివరాలను స్థానిక జీఆర్పీ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. గుంతకల్లు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం –7లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వెస్ట్ బెంగాల్‌లోని రాంచీ నగరానికి చెందిన అమరనాథ్ జైస్వాల్ అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో రైల్వే పోలీసులు విచారణ చేయడంతో అసలు విషయం బయటపడింది. రైళ్ల ప్రయాణిస్తూ ప్రయాణికులు అదమరిచి నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగుల్లోని విలువైన బంగారం, నగదు అపహరించేవాడు. ఈ క్రమంలోనే గుంతకల్లు జీఆర్‌పీ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 4, అక్టోబర్ 2న చోరీలు చేశాడు. ఈ కేసుల్లో చోరీ చేసిన మొత్తం 270 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ ప్రస్తుత మార్కెట్ ధర మేరకు దాదాపు రూ.15 లక్షలకు పైగా ఉంటుంది. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఆర్‌ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు, కానిస్టేబుళ్లు హుస్సేన్, గాదిలింగ, ప్రకాష్, అలీ, నబీ, ఆర్‌పీఎఫ్ ఎఎస్‌ఐ నాగరాజు తదితరులను జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి అభినందించారు.



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎం మృతి



నరేష్‌రెడ్డి (ఫైల్)

గుత్తి: పెద్దవప్పూరు మండలం కుమ్మెత గ్రామంలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై జూనియర్ లైన్‌మన్ నరేష్‌రెడ్డి(28) మృతి చెందాడు. వివరాలు... కుమ్మెత గ్రామంలో రైతు తిరుపాల్‌కు చెందిన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు పోయింది. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న జేఎల్‌ఎం నరేష్‌రెడ్డి అక్కడకు చేరుకుని జూటూరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ అడిగాడు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి ఫీజు వేస్తుండగా విద్యుత్ ప్రసారం జరిగి షాక్ గురై కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నరేష్‌రెడ్డిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

వ్యాధులపై సర్వే పూర్తి చేయండి

బుక్కరాయసముద్రం: వ్యాధులపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఎం నేషనల్ హెల్త్ మిషన్ అధికారి డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. బీకేఎస్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలు ఆరా తీశారు. అసంక్రమిత వ్యాధుల సర్వే లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతిలక్ష్మి, తాహెరున్నీసా, సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్‌ఎం చెన్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

కనగానపల్లి: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కనగానపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు యోగా గురువు సుబ్బరాయుడు బుధవారం తెలిపారు. కనగానపల్లి ఆదర్శ, కేజీబీవీ, జెడ్పీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వీరిలో లావణ్య, హరిత, వంశిక, శ్రావ్య, హరిప్రియ, స్నేహ పతకాలు సాధించారన్నారు.

అపరిచితులను వార్డుల్లోకి అనుమతించొద్దు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులను సందర్శించే సమయంలోనే (విసిటింగ్ హవర్స్) రోగి సహాయకులను లోపలికి అనుమతించాలి. అపరిచిత వ్యక్తులను వార్డుల్లోకి అనుమతించకూడదని డీఎస్పీ ప్రసాద రెడ్డి సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సర్వజనాస్పత్రిలోని లెక్చరర్స్ గ్యాలరీలో సెక్యూరిటీ సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రథమంగా రోగుల సహాయకులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. జిల్లాలో పేద ప్రజలకు పెద్దదిక్కు పెద్దాస్పత్రి అని, వివిధ గ్రామాల నుంచి వచ్చే రోగులతో మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. కాన్పుల వార్డు, హౌస్‌సర్జన్, పీజీ మహిళల హాస్టళ్ల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానితులు కనిపిస్తే తక్షణం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. అడ్మిషన్‌లో ఉన్న రోగులను ఐసోలేషన్‌లో ఉంచితే వారు త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పెద్ద సంఖ్యలో రోగి సహాయకులు, ఇతరులు వార్డుల్లోకి ప్రవేశిస్తే ఇన్‌ఫెక్షన్ పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా పోలీసు శాఖ సహకారంతో సెక్యూరిటీ సిబ్బందికి త్వరలో శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శివరాముడు, అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ సునీత, సెక్యూరిటీ మేనేజర్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద రెడ్డి

గుత్తిలో చైన్‌స్నాచింగ్

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగుడు అపహరించుకెళ్లాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... ఈ నెల 9న కర్నూలుకు చెందిన జ్యోతిర్మయి గుంతకల్లులో పనిముగించుకుని తిరుగు ప్రయాణంలో గుత్తి బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు ఆగిన సమయంలో కిందకు దిగి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి బస్సు ఎక్కుతున్న సమయంలో ఓ దుండగుడు ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. వెంటనే బాధితురాలు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

జనవాక్కు

ప్రాణాలు నిలబెట్టారు



కూలి పనులతో జీవనం చేస్తున్న మాకు రోగాలు వస్తే కనీస చికిత్సకూ ఇబ్బంది పడక తప్పదు. ఇక పెద్ద రోగాలు వస్తే ఆ దేవుడే దిక్కు. గత ఏడాది కడుపు నొప్పి ఎక్కువగా ఉందని ఆస్పత్రికి వెళితే... ఐదు కిలోల కణతి ఉందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్ చేసి తీసేయ్యాలి. రూ.5 లక్షలు ఖర్చవుతుందన్నారు. నాకు గుండె ఆగినంత పనైంది. ఇంటికి వచ్చిన తర్వాత వలంటీర్ వచ్చి ఏమైందని అడిగితే విషయం చెప్పా. భయపడొద్దు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తారని చెప్పి అనంతపురంలోని ఓ పెద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. ఈ రోజు ప్రాణాలతో ఉన్నానంటే దానికి సీఎం వైఎస్ జగనే కారణం. నేను జగన్ వల్ల బతికితే, ఒకప్పుడు నా భర్త హనుమంతప్ప దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల బతికాడు. అప్పట్లో ఆయన గుండెలో పడిన రంధ్రాలకు పెద్దాస్పత్రిలో ఆపరేషన్ చేసి నయం చేశారు. ఆరోగ్యశ్రీ కింద రూ.3 లక్షలను రాజన్న ప్రభుత్వమే చెల్లించింది. నా ప్రాణం ఉన్నంత వరకూ సీఎం వైఎస్ జగన్ మేలు మరువను.

– మారెక్క, శెట్టూరు

పేదల పెన్నిధి



పేదల బతుకు గురించి గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. సీఎంగా వైఎస్ జగనన్న బాధ్యతలు తీసుకున్న తర్వాత అమలవుతున్న వివిధ పథకాలతో మా పేదల బతుకులు ఎంతో బాగుపడ్డాయి. కూలి పనులతో పొట్ట పోసుకుంటున్న మాకు ఇద్దరు పిల్లల చదువుల కోసం గతంలో నానా ఇబ్బందులు పడ్డాం. అమ్మ ఒడి పథకంతో మా పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పిస్తున్న పేదల పెన్నిధి వైఎస్ జగనన్న పది కాలాల పాటు చల్లగా ఉండాలి.

– గంతి కొండమ్మ, రామాపురం, తాడిమర్రి మండలం

ఉపాధి దొరికింది



మాది సామాన్య వ్యవసాయ కుటుంబం. ఆదాయం అంతంత మాత్రమే. పాత ఇంట్లోనే జీవనం సాగిస్తున్నాం. ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో బతుకు నెట్టుకొస్తున్నాం. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారికి లేపాక్షి నవోదయాలో సీటు రావడంతో కాస్త వెసలుబాటు కలిగింది. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉండడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాత బకాయిలు విడతల వారీగా రద్దు చేస్తూ వచ్చారు. అంతేకాక బ్యాంకులో రూ.50 వేలు రుణం తీసుకుని చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నా. నా భర్త వేణు రెడ్డి సహకారంతో ఉదయం, సాయంత్రం పాల వ్యాపారం మొదలు పెట్టా. సీఎం వైఎస్ జగన్‌తోనే మా కుటుంబంలో కష్టాలు దూరమయ్యాయి. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– రాజమ్మ, మరవకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

మేలు మరువం



మాది నిరుపేద కుటుంబం. నా భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసి అత్తారింటికి పంపా. కొడుకు, కోడలితో కలిసి ఉంటున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కష్టాలు తీరాయి. నెలనెలా పెన్షన్ డబ్బు అందుతోంది. దీంతో పాటు వైఎస్సార్ చేయూత కింద నాలుగున్నరేళ్లుగా లబ్ధి పొందుతున్నా. సీఎం జగన్ చేసిన మేలును మర్చిపోను.

– ప్యారిమా షేక్, ఎం.రాయాపురం గ్రామం, రొళ్ల మండలం

సంక్రాంతికి వెహికల్ అండర్ పాస్ పూర్తి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ వద్ద వెహికల్ అండర్ ఆస్ పనులు రానున్న సంక్రాంతి నాటికి పూర్తవుతాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అండర్ పాస్ పనులను ఆయన పరిశీలించారు. నిర్దేశిత సమయంలోపు పనులను నాణ్యతతో పూర్తి చేయాలని రైల్వే, ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఆయ మాట్లాడుతూ... నగరంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే బ్రిడ్జి అందుబాటులోకి రాగా, అనంతరం ఆయ మాట్లాడుతూ... నగరంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అండర్‌పాస్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న వారి బ్యాంక్ ఖాతాల్లోకి త్వరలో పరిహారం జమ అవుతుందన్నారు. బ్రిడ్జ్ వద్ద సర్వీసు రోడ్డుతో పాటు ఇతర అభివృద్ధి పనులూ పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మేయర్ వసీం, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖరరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గౌస్ బేగ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్ బాలాంజినేయులు తదితరులున్నారు.



అండర్ పాస్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఆశ్రమ పాఠశాల విద్యార్థుల అదృశ్యం

కదిరి అర్బన్: తన పిల్లలు కనిపించడం లేదంటూ గాండ్లపెంట మండలం పెద్దతండాకు చెందిన శ్రీనివాసులునాయక్ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు నాయక్, విజయకుమారి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. వీరిలో ధనుష్‌నాయక్ నల్లమాడ మండలం ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి, శశాంక్‌నాయక్ 5వ తరగతి చదువుతున్నారు. గత శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో స్వగ్రామానికి చేరుకున్న వారు ఈ నెల 12న ఆశ్రమ పాఠశాలకు పంపించేందుకు తల్లి కదిరి బస్టాండ్‌కు చేరుకుంది. తాము పాఠశాలకు వెళ్తామని పిల్లలు చెప్పడంతో వారిని బస్టాండులో వదిలి ఆమె స్వగ్రామానికి తిరిగి వెళ్లింది. అనంతరం పిల్లలు పాఠశాలకు చేరుకున్న విషయంపై స్కూల్ టీచర్‌కు ఫోన్ చేసి అడగడంతో రాలేదని తెలపడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థుల ఆచూకీ తెలిసిన వారు 94407 96851కు సమాచారం ఇవ్వాలని కోరారు.



ధనుష్ నాయక్, శశాంక్ నాయక్

క్లుప్తంగా

నేడు పి.యాలేరులో వై ఏపీ నీడ్స్ జగన్

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ నీలిమ, సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి అయ్యప్ప ఉత్సవాలు



అలంకరణలో అయ్యప్ప స్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో కొలువైన అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురుస్వాములు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. 15న ఆలయ శుద్ధి, 16న ఉదయం ధ్వజారోహణం తర్వాత 36 కలశాలతో మహాపడిపూజ, 17న ఉదయం ఉత్సవ పూజ, సాయంత్రం గ్రామోత్సవం, 18న లక్ష పుష్పార్చన, సాయంత్రం అగ్నిగుండం, 19న ఉదయం ఉత్సవపూజ రాత్రి పళ్లివేట, 20న ఉత్సవ బలి తదుపరి కేరళ సంప్రదాయరీతుల్లో ఆరాట్టు (చక్రస్నానం)తో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. నిత్యం సాగే ప్రత్యేక పూజలు, అలంకార సేవల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

హైందవ ధర్మ ప్రచారమే లక్ష్యం



వేంకటేశ్వర వైభవ యాత్రలో పాల్గొన్న అనంత వాసులు

అనంతపురం కల్చరల్: హైందవ ధర్మప్రచారమే లక్ష్యంగా వేంకటేశ్వర వైభవ యాత్ర సాగుతోందని విజన్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటూ నగరంలోని వివిధ ఆలయాల వద్దకు వెళ్లిన వేంకటేశ్వర వైభవ యాత్ర బుధవారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని సీతారామాంజనేయస్వామి దేవస్థానం వద్దకు చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆళ్లగడ్డ రాము నేతృత్వంలో యాత్రా రథాన్ని భక్తులు సందర్శించుకుని పూజలు చేపట్టారు. శ్రీవారి భజనలు నిర్వహించారు. విజన్ ట్రస్టు నిర్వాహకురాలు మంజుల మాట్లాడుతూ.. యాదాద్రి తిరుమల దేవస్థానం నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో ధర్మప్రచారం నిర్వహిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో 500 ఆలయాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. అనంతరం యాత్రా రథం కర్నూలు బయల్దేరి వెళ్లింది.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైన నసనకోట పాఠశాల విద్యార్థులు

రామగిరి: మండలంలోని నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మేనక, రఘురామ్, విజయరాజు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం నాగరత్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటడంతో జాతీయస్థాయి స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో కేరళలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పీడీ చామంతి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఫిజియోథెరపీ కోర్సులతో ఉపాధి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ఫిజియోథెరపీ లాంటి పారా మెడిసిన్ కోర్సుల ద్వారా ఉపాధి పొందవచ్చని ఎస్పీ అన్బురాజన్, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సూచించారు. నగరంలో నూతనంగా ప్రారంభమైన వీవీఐఎంఎస్ ఫిజియోథెరపీ కళాశాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన విద్యార్థుల డాక్టర్ కావాలనే కల కలగానే మిగలకుండా ఫిజియోథెరపీ వారి కలను నిజం చేస్తుందన్నారు. ఇందుకు వీవీఐఎంఎస్ ఫిజియోథెరపీ కళాశాల అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 6304293895 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్ జగన్



అనంతపురం కార్పొరేషన్: 39వ సచివాలయ పరిధిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



అనంతపురం కార్పొరేషన్: 63వ సచివాలయ పరిధిలో జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు



అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామంలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- కొనసాగుతున్న 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనంతపురం కార్పొరేషన్: నగరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. బుధవారం నగరంలోని 39వ సచివాలయ పరిధిలోని అశోక్‌నగర్, 63వ సచివాలయ పరిధిలోని నాల్గవ రోడ్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్లు రమణ, ఇసాక్, శాంతిసుధ, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డిలు సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. డివిజన్లలోని వివిధ సచివాలయాల పరిధిలో రూ.కోట్లతో సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ చరిత్రలో లేని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోందన్నారు. గతంలో ప్రధాన రోడ్లు గుంతలమయంగా ఉండేవన్నారు. అటువంటిది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో నగరం నలుదిక్కులా అభివృద్ధి జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దయ తలిస్తేనే పథకాలు వచ్చే దారుణమైన పరిస్థితులు ఉండేవన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వరి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, ఎంఎల్‌ఓ అమర్‌నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అందరి మేలు కోరి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓటు వేసి గెలిపించుకుందామని అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామంలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మరోమారు దీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు భారతి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మలిరెడ్డి, ఈశ్వరయ్య, కక్కలపల్లి, ఉప్పరపల్లి, కందుకూరు, ఆకుతోటపల్లి సర్పంచులు గార్లదిన్నె కృష్ణయ్య, సావిత్రి శ్రీనివాసులు, ప్రశాంత్ కుమార్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తూ, అభివృద్ధే ధ్యేయంగా పని చేసే వాళ్లే నిజమైన నాయకులు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దొరకడం ప్రజల అదృష్టమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ హేమలత తెలిపారు. బుధవారం మండలంలోని పంపనూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. నవరత్నాల్లోని పథకాల ద్వారా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేశారని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే సాధ్యమని తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాలతో ర్యాలీ చేపట్టారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఎలక్షన్ మండల ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ, సర్పంచులు ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, సుబ్బారెడ్డి, అంజి, వెంకటేష్, కేశవ్‌నాయక్, నరసింహ, రామచంద్ర, సూర్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మండలం పంపనూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

20 ఏళ్ల రోడ్డు కల సాకారం

- రూ.3 లక్షల సొంత నిధులతో మట్టి రోడ్డు వేయించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

కనగానపల్లి: మండలంలోని కేఎస్ పాళ్యం గ్రామస్తులు 20 ఏళ్లుగా ఎదురుస్తున్న రోడ్డు కల సాకారమైంది. ఈ గ్రామం నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న పేరూరుకు వెళ్లేందుకు రహదారి సరిగా లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఇక్కడ పాలకులుగా ఉన్న పరిటాల కుటుంబ సభ్యులు ఈ రహదారి గురించి పట్టించుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.3 లక్షల తన సొంత నిధులు వెచ్చించి రహదారిపై ఉన్న ముళ్ల కంపలు తొలగించి మట్టి రోడ్డు వేయించారు. గత వారం రోజులుగా జరుగుతున్న ఈ రోడ్డు పనులను బుధవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించారు. రోడ్డు పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు గంగుల సుధీర్ రెడ్డి, ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ఒప్పంద కార్మికులకు నియామక పత్రాలను అందజేస్తున్న మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మేయర్ వసీం అన్నారు. నగరపాలక సంస్థలోని ప్రజారోగ్య విభాగంలో ఒప్పంద కార్మికులుగా ఎంపికైన వారికి బుధవారం ఆప్కాస్ జారీ చేసిన ఇంటిమేషన్ లెటర్స్ (నియామక పత్రం) అందజేశారు. కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజారోగ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న నలుగురు పారిశుధ్య కార్మికులు అనారోగ్యానికి గురికావడంతో వారికి బదులుగా కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అంకితభావంతో పని చేసి ప్రజలకు సేవలందించాలని ఉద్యోగులకు కార్యదర్శి సంగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులుకు నియామక పత్రాలు పొందిన సురేష్‌బాబు, ఎం.చెన్నయ్య, బీ శ్రీహరి, ఎం కార్తీక్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు కమల్‌భూషన్, సాకే చంద్రకళ, శ్రీనివాసులు, రమణ, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

టిప్పు విగ్రహ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిరా రమేష్ కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరా రమేష్ మాట్లాడుతూ.. నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటుకు ఆమ్ ఆద్మీ సంపూర్ణ మద్దుతు ఇస్తోందన్నారు. అలాగే కుల సంఘాలు కూడా మద్దతు తెలుపుతున్నాయన్నారు. టిప్పు సుల్తాన్ మొట్టమొదటి జాతీయ వాది అని, ఆయన పరిపాలనలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. రైతులకు అధికంగా లబ్ధి చేకూర్చేలా పాలన చేపట్టారన్నారు. అలాగే కొత్త క్యాలెండర్, కొత్త నాణెలను ప్రవేశపెట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని వెల్లడించారు. మైసూరు ప్యాలెస్ వద్ద శ్రీరంగనాథ దేవాలయం నిర్మించారన్నారు. శృంగేరి వద్ద శారదాదేవి ఆలయ నిర్మాణానికి నిధులు అందించారన్నారు. స్వేచ్ఛకు గుర్తింపుగా తన రాజధాని శ్రీరంగ పట్టణంలో ఒక వృక్షాన్ని నాటినట్లు గుర్తు చేశారు. బ్రిటీష్ వారిని భారతదేశం నుంచి తరిమికొట్టడానికి పోరాడారన్నారు. ఇలాంటి మహనీయుడి విగ్రహం ఏర్పాటుకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఐఎంఎం బాష, జాకీర్, మధు, మసుద్, తేజ, షబ్బీర్, నూర్, బషీర్, బాషా, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

వంకర టింకరగా నిర్మించి.. లబ్ధి చేకూర్చి



టీడీపీ నేత బుగ్గయ్య చౌదరి ఇంటి ముందు కాలువ ఏర్పాటు చేయని దృశ్యం



విద్యుత్‌నగర్ సర్కిల్‌లో ఓ హోటల్ నిర్వాహకుడి కోసం కాలువను వంకర టింకరగా మార్చిన దృశ్యం

- ఇష్టారాజ్యంగా డ్రైనేజీల నిర్మాణం
- ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంతో నగరంలో కాలువల నిర్మాణం ఇష్టానుసారంగా జరుగుతోంది. నిర్వాసితులు కోరినట్లు కాలువ నిర్మాణాలు చేపడుతుండటంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిలువెత్తు సాక్ష్యమే నగరంలోని 30వ డివిజన్‌లో జరుగుతున్న రెండు సీసీ కాలువ నిర్మాణాలని చెప్పాలి. నగరంలోని విద్యుత్‌నగర్ ట్రిల్లీస్ స్కూల్ ఉండే వీధిలో సాధారణ నిధుల కింద రూ.8 లక్షలతో సీసీ కాలువ నిర్మిస్తున్నారు. వాస్తవంగా ఈ కాలువను నారాయణ స్కూల్ సమీపం నుంచి టీడీపీ నాయకుడు బుగ్గయ్య చౌదరి ఇంటి వరకూ వేయాలి. అయితే టీడీపీ నాయకుడి ఇంటి ముందు ర్యాంప్, తదితర నిర్మాణాలు పోతాయని, ఆ నేత కోరిక మేరకు ఇంజినీరింగ్ అధికారులు కాలువను పూర్తి స్థాయిలో వేయలేదు. అదే విధంగా విద్యుత్ నగర్ సర్కిల్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలతో సీసీ కాలువ ఏర్పాటు చేస్తున్నారు. ఓ హోటల్ నిర్వాహకుడు రోడ్డుకు ఆనుకుని నిర్మాణం చేపట్టాడు. కానీ అధికారులు ఆ నిర్మాణం దెబ్బతినకూడదని కాలువను వంకర టింకరగా మార్చి నిర్వాహకుడికి పరోక్షంగా సహకరించారు. క్షేత్రస్థాయిలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రామమోహన్ రెడ్డి పర్యటించకపోవడంతోనే అడ్డగోలుగా నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రభుత్వంపై విమర్శలు వచ్చేలా అధికారులు వ్యవహరిస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

ఎమ్మెల్యే చొరవతో మట్టిరోడ్డు నిర్మాణం



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

రాప్తాడురూరల్: నగర శివారులో రుద్రంపేట నుంచి ఆలమూరుకు వెళ్లేదారి గుంతలు ఏర్పడి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడి చొరవ తీసుకుని తాత్కాలికంగా గుంతలను పూడ్పించి మట్టిరోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. కట్టకిందపల్లి వరప్రసాద్‌రెడ్డి, ఆలమూరు శ్రీకాంత్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. గుంతలను పూడ్పించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసిన ఎమ్మెల్యేకు వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

త్రీటౌన్ ఎస్‌ఐగా గోపాలుడు

అనంతపురం క్రైం: త్రీటౌన్ ఎస్‌ఐగా గోపాలుడు బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. కసాపురం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పని చేసిన గోపాలుడు బదిలీపై అనంతపురం 3 టౌన్‌కు వచ్చారు.

దుప్పట్లు, పండ్లు పంపిణీ

అనంతపురం రూరల్: బళ్లారి రోడ్డులో ఉన్న బెరాకా అనాథాశ్రమంలోని వృద్ధులకు సైనిక ప్యాకర్స్ మూవర్స్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సైనిక ప్యాకర్స్ మూవర్స్ ప్రతినిధి సురేష్ మాట్లాడారు. అనాథలు సైతం క్రిస్మస్ పండగను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో దుస్తులు, పండ్లు అందించామన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకుంటేనే సమాజంలో అందరూ సంతోషంగా ఉండగలరని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, పాస్టర్ మోసెస్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప గ్రామోత్సవం సందర్భంగా హారతులు పట్టిన మహిళలు



అయ్యప్పను ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చిన దృశ్యం

అనంతపురం కల్చరల్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ మాలధారుల శరణుఘోషతో ఎస్కేయూ రోడ్డు పరిసరాలు మార్మోగాయి. కైలాసనాథుడి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామికి బుధవారం పడిపూజ నిర్వహించారు. గురుస్వామి మణికంఠ విజయ్‌స్వామి నేతృత్వంలో మధ్యాహ్నం వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు సర్వాంగ సుందరంగా పుష్పరథంపై అయ్యప్ప స్వామిని కొలువుదీర్చి ఊరేగించారు. భాజాభజంత్రీలు, భక్తుల ఆనందతాండవం,భక్తిగీతాలాపనల నడుమ పురవీధుల్లో ఉత్సవం సాగుతున్నప్పుడు భక్తులు హారతులు పట్టారు. ఆనవాయితీగా ఇంటింటికీ వెళ్లి స్వామి ప్రసాదాన్ని అందించారు.

ఉద్యమ యోధుడు 'నీలం రాజశేఖర్‌రెడ్డి'



నీలం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప నేత నీలం రాజశేఖర్ రెడ్డి అని సీపీఐ నాయకులు కొనియాడారు. నీలం రాజశేఖర్‌రెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. నీలం రాజశేఖర్‌రెడ్డి మార్కిస్టు అధ్యయన శీలుడిగా భూస్వామ్య దౌర్జన్యాలకు ఎదురునిలిచి పోరాటం చేశారన్నారు. పేదలకు ఆత్మీయుడిగా కమ్యూనిస్టు శ్రేణులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, రమణ, నాయకులు అల్లిపీరా, మున్నా, శ్రీనివాసులు, అమీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గంగుల సుధీర్‌రెడ్డికి అభినందన

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన మద్దెలచెరువు గంగుల సుధీర్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలియజేశారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అమరనాథరెడ్డి, జెడ్పీటీసీ మారుతిప్రసాద్, పలువురు మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం సుధీర్‌రెడ్డిని కలసి అభినందించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో తన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'క్లాట్' పరీక్షలో సత్తా



కృష్ణచైతన్యరెడ్డికి బొకే అందజేస్తున్న ఎస్‌ఆర్‌ఐ కళాశాల చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ లా యూనివర్సిటీల్లో (ఎన్‌ఎల్‌యూ) ప్రవేశాలకు నిర్వహించిన 'క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)లో ఆదిమూర్తి నగర్‌లోని ఎస్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గౌని కృష్ణ చైతన్య రెడ్డి జాతీయస్థాయిలో సత్తా చాటాడు. దాదాపు 1.5 లక్షల మందికి పైగా పోటీ పడిన ఈ పరీక్షలో జాతీయ స్థాయి జనరల్ కేటగిరీలో 3,639వ ర్యాంకు, జాతీయస్థాయి ఓబీసీ కేటగిరీలో 465వ ర్యాంకు సాధించాడని కళాశాల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో శ్రమించన లేకుండా కృషి చేస్తే సాధించలేనిది ఏది ఉండదని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థిని సన్మానించారు. కృష్ణచైతన్య రెడ్డి తండ్రి గౌని నాగన్న అనంతపురం నగరంలో సీనియర్ న్యాయవాది, తల్లి సరోజ గృహిణి. కార్యక్రమంలో కళాశాల ఎండీ చంటి రెడ్డి, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సమీనాఖాన్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా స్థాయి త్రోబాల్ జూనియర్ విభాగం సెలక్షన్ పోటీల్లో నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న చైతన్య బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులు స్పందన, చరణ్య, టీ.కుందన, కే.జోషని, టీ.భవ్యను అభినందించారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, అకడమిక్ కో–ఆర్డినేటర్ నాగభూషణ, డీన్ సత్యనారాయణ, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్, పీఈటీ సుగుణ, సంధ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
- లిసిప్రియ

నిండు సభలో...
నిగ్గదీసి అడిగిన అగ్గిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపుర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపుర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

> **నా నేరం ఏమిటి?**
> నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.
> – లిసిప్రియ, యాక్టివిస్ట్

> **యాక్ట్ నౌ**
> దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై. పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.
> 'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్
ఆషిక్



కుమారునికి వంట నేర్పితే?

ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.


తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నీషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్


బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.





- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.



* హెల్త్ కేర్ నివేదిక

'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70-80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.